ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



బన్సీలాల్‌పేట్: పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కాలేజీలో బుధవారం విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసు అధికారులు కె. వేణుగోపాల్, అనిల్‌కుమార్ ఎన్‌సీసీ విద్యార్థులకు ట్రాఫిక్ విధి విధానాల ను వివరించారు. నిబంధనల ప్రకారం వాహనాలను నడపాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను జంప్ చేయరాదని, అతివేగంగా డ్రైవ్ చేయరాదని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. అతివేగంగా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపి అనేక మంది ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, అమర్‌నాథ్ శర్మ, ఎన్‌సీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్లు బాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్‌లో చేరిక



అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌లో బుధవారం పలువురు ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు చేరారు. సికింద్రాబాద్‌లోని మజ్దూర్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు సమక్షంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కాచిగూడ బ్రాంచ్‌లోని పలువురు నాయకులు మజ్దూర్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా శంకర్‌రావు వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారంతో పాటు అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న మజ్దూర్ యూనియన్‌లో చేరడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీఎస్ భాస్కర్‌రావు, హైద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ కృష్ణ, డివిజనల్ ప్రెసిడెంట్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

అమీర్‌పేట: డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడితో పాటు వినియోగదారుడిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకటరమణ వివరాలు వెల్లడించారు. మల్కాజిగిరికి చెందిన మాథ్యూ సంజేయ్ కుక్కలను పెంచి విక్రయించేవాడు. కొంత కాలంగా అతను బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో, ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించి మాథ్యూ సంజేయ్‌ను అదుపులోకి తీసుకున్నారు.అతడి నుంచి 16 గ్రాములు ఎండీఎంఏ, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరులో ఉంటున్న అసదుల్లా అతడికి డ్రగ్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. మ్యాథూ వద్ద 10 మంది డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు గుర్తించారు. నిందితుడు మాథ్యూ ఇచ్చిన సమాచారం మేరకు డీజే ఆపరేటర్ ముచినపల్లి రాజ్‌కుమార్‌ను సైతం అరెస్టు చేశారు. సరఫరా చేస్తున్న అసదుల్లా పరారీలో ఉన్నట్లు తెలిపారు. మాథ్యూ వద్ద డ్రగ్ కొనుగోలు చేసిన మరో 9 మందిని త్వరలో అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. సమావేశంలో యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ శ్రీధర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డీఐ జానకి రాములు,ఎస్సై రాజు రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పాలనాధికారులకు సన్మానం



గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి, మెడికల్ కాలేజీల్లో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారిలను తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం గాంధీ యూనిట్ ప్రతినిధులు బుధవారం పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. నిరుపేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు, వైద్యవిద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందించేందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీజీజీడీఏ గాంధీ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు భూపేంద్రసింగ్ రాథోడ్, అబ్బయ్యలతోపాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యకు చెక్

నూతన పైప్‌లైన్ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ బీదల బస్తీ డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యకు చెక్ పెట్టేందుకు నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. బీదలబస్తీలో గత కొన్నాళ్లుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ లీకై మురుగు నీరు పొంగి ప్రవహిస్తుంది., దుర్గంధంతో స్థానికులు పడుతుండటంపై 'మురుగు సమస్యను పరిష్కరించండి' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్థానిక కార్పొరేటర్ సామల హేమతోపాటు జలమండలి అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో ఆమె బుధవారం బీదలబస్తీ, రేణుక ఎల్లమ్మ దేవాలయం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో భారీ వృక్షాలకు చెందిన వేర్ల కారణంగా డ్రైనేజీ పైప్‌లైన్ దెబ్బతిన్నట్లు గుర్తించారు. సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన 'సాక్షి' యాజమాన్యానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి ఇంఛార్జీ మేనేజర్ వరుణ్, బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్, మురళీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ, అధికారులు

ఘనంగా బోనాల జాతర



రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఆషాఢ మాస బోనాల జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. బోర్డు పరిధిలో ప్రసిద్ధి చెందిన లాల్‌బజార్ మహంకాళి అమ్మవారి ఆలయంతో పాటు ఇన్‌ఫాంట్ జీసస్ కాలనీ నల్ల పోచమ్మ ఆలయం, తిరుమలగిరి విలేజ్ లోని పోచమ్మ ఆలయం, తిరుమలగిరి లోని గండిమైసమ్మ ఆలయాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచే భక్తులు ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బీఆర్‌ఎస్ నాయకురాలు నివేదిత సాయన్న, బీఆర్‌ఎస్ నాయకులు కేబీ, శంకర్రావు, కాంగ్రెస్ నాయకురాలు నాగినేని సరిత, లాల్‌బజార్ ఆలయ ఈవో సత్యచంద్రారెడ్డి, బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మురళి ముదిరాజ్, సుధాకర్, భక్తవత్సలం తదితరులు వివిధ ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.



బోనాల వేడుకలో పాల్గొన్న నివేదిత సాయన్న



లాల్‌బజార్‌లో..

జీహెచ్‌ఎంసీ ఆధీనంలోకి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్వహణ

బన్సీలాల్‌పేట్: పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు వివాహాది, శుభకార్యాలు నిర్వహించుకునేందుకు వీలుగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్వహణ బాధ్యతలను ఇకపై జీహెచ్‌ఎంసీ స్వయంగా చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు బన్సీలాల్‌పేట్ లోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్వహణ బాధ్యతలను ఎస్టేట్ సిబ్బందికి అప్పగించారు. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఎస్టేట్ సిబ్బంది వెంకటేష్, రఘు ఫంక్షన్ హాల్ నిర్వహణను పర్యవేక్షించనున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్వహణ స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడి చేతుల్లో ఉండేది. స్థానిక నేతలతో కలిసి ఆయన ఫంక్షన్‌హాల్ నిర్వాహణను పర్యవేక్షించేవారు. పేదల కోసం నిర్మించిన ఫంక్షన్ హాల్ నిర్వాహణ అవినీతి అక్రమాలకు నిలయంగా మారిందని ఆరోపిస్తూ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిరంజీవి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సదరు ఫంక్షన్‌హాళ్ల నిర్మాణ జీహెచ్‌ఎంసీ చేపట్టాలని ఆదేశిస్తూ గ్రేటర్ కమిషనర్‌కు లేఖ రాసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాప్రభుత్వంలో పేద, మధ్య తరగతి వర్గాలకు మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లు అందుబాటులో ఉంచేందుకు వీలుగా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు చిరంజీవి తెలిపారు.



బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్

ఎస్టేట్ సిబ్బందికి బాధ్యతలు

బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్వహణ బాధ్యతలను ఎస్టేట్ సిబ్బంది అప్పగించినట్లు డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ప్రజలు ఫంక్షన్‌హాల్‌ను బుక్ చేసుకోవచ్చునన్నారు. శుభకార్యాలు, ఇతరత్రా కార్యక్రమాల కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని రూ. 10,800 అద్దె చెల్లించాలని ఎస్టేట్ సిబ్బంది వెంకటేష్ పేర్కొన్నారు.

నాగులూరి నర్సింహ ఆశయసాధనకు కృషి



చిలకలగూడ : ప్రముఖ సంఘసేవకుడు స్వర్గీయ నాగులూరి నర్సింహ ఆశయసాధనకు కృషి చేస్తామని నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగులూరి సాయిబాబా అన్నారు. నర్సింహ 47వ వర్ధంతి సందర్భంగా బుధవారం చిలకలగూడ జీహెచ్‌ఎంసీ పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన తండ్రి ఆశలు, ఆశయ సాధన కోసం తనవంతు కృషి చేస్తానని అసోషియేషన్ అధ్యక్షుడు సాయిబాబా అన్నారు. అనంతరం పలు సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు దళిత సంఘ నాయకులు నర్సింహ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమలతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలి

లాలాపేట: తెలంగాణ ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని తెలంగాణ స్టేట్ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం లేబర్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్, కోశాధికారి బి. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 2019 డిసెంబర్ 1న అప్పటి ముఖ్యమంత్రి ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను రద్దు చేసి వెల్ఫేర్ బోర్డులను ఏర్పాటు చేశారన్నారు. అయితే బోర్డులో యాజమాన్యానికి నచ్చిన వారినే సభ్యులుగా నామినేట్ చేస్తున్నారని ఆరోపించారు. వారు ఏనాడు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదన్నారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947 ప్రకారం వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే వెల్ఫేర్ బోర్డును తక్షణమే రద్దు చేసి ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని లేబర్ కమిషన్‌ను కోరారు.



కుల గణనతోనే బీసీలకు న్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: కుల గణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని పలువురు వక్తలు అన్నారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీలోని 57వ తరగతి గదిలో ఓయూ బీసీ విద్యార్థులు, బీసీ బడి ఆధ్వర్యంలో బీహార్ హైకోర్టు తీర్పు నేపథ్యంలో 'కులగణన-అవరోధాలు-పరిష్కారాలు' అంశం పై సదస్సు జరిగింది. కార్యక్రమానికి నూకల మధు యాదవ్ అధ్యక్షత వహించగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్, మాజీ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, ప్రొ.ప్రభంజన్ కుమార్ యాదవ్, ప్రొ.రామ్ బీణవేణి, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడెపాక కుమారస్వామి తదితరులు పాల్గొని ప్రసంగించారు. జనాభాకు అనుకూలంగా రిజర్వేషన్లు పెంచాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డా.పరంధాములు, కేవీ గౌడ్, అశోక్ యాదవ్, డా.సాంబ శివగౌడ్, చామకుర రాజు, కడారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్సీని అంబులెన్స్‌గా మార్చేశాడు

కంటోన్మెంట్: ట్యాక్సీ కారును అంబులెన్స్‌గా నడుపుతున్న వ్యక్తిని బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పలు అంబులెన్స్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మారుతి ఎర్టిగా వాహనాన్ని నిబంధనలకు విరుద్ధంగా అంబులెన్స్‌గా కొనసాగిస్తున్నట్లు గుర్తించారు. సదరు వాహనానికి ఆర్‌టీఏ నుంచి అనుమతులు లేవని, అవసరమైన వైద్య పరికరాలు కూడా లేనట్లు గుర్తించారు. వాహన యజమాని సందీప్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు మోటార్ వెహికిల్ యాక్ట్ -1998 ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ ఆదిలాబాద్ ఆర్‌టీఏ అధికారులకు వాహనంతో పాటు, నిందితుడిని అప్పగించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: ఉస్మానియా యూనివర్సిటీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 25న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీజీఎస్పీడీసీఎల్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల లేడీస్ హాస్టల్ ఫీడర్ పరిధిలోని బీఈడీ కాలేజ్, మాణికేశ్వరీనగర్, యాదయ్యనగర్, మసీద్, మోడల్ స్కూల్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2గంటల నుంచి 5.30గంటల వరకు ఓయూ ఫీడర్ పరిధిలోని ఓయూ డైరీ ఫాం, పోస్ట్ ఆఫీస్, పీజీ కాలేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

విద్యార్థులు లక్ష్యసాధన కోసం కృషి చేయాలి



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతోమంది ఉన్నత స్థానానికి చేరుకున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. బుధవారం అశోక్‌కాలనీలోని సనత్‌నగర్ ఓల్డ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనంలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం తపించడమే కాకుండా వాటిని సాకారం చేసుకోవాలన్నారు. తమకు అందివచ్చిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మార్తా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫహీం ఫాతిమా, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నాయకులు బాల్‌రెడ్డి, రాజు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

- 25 కేజీల గంజాయి స్వాధీనం

కంటోన్మెంట్: భారీ మొత్తంలో గంజాయి విక్రయాని పాల్పడుతున్న వ్యక్తిని బోయిన్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని, అతడి నుంచి 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రం జైత్‌పూర్‌కు చెందిన విక్రమ్ కుమార్ బోయిన్‌పల్లి మల్లికార్జున్ నగర్‌లో ఉంటూ స్థానిక డీహెచ్‌ఎల్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ సంస్థలో పనిచేస్తున్నాడు. అదనపు ఆదాయం కోసం అతను తనకు పరిచయస్తుడైన లారీ మెకానిక్ బలరామ్ సూచన మేరకు గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు బలరామ్, విక్రమ్‌కు 25 కేజీల గంజాయి అప్పగించి తాను సూచించిన వ్యక్తికి సరఫరా చేయాలని చెప్పాడు. మంగళవారం రాత్రి విక్రమ్ కుమార్ సీతారాంపూర్‌లోని మల్లారెడ్డి గార్డెన్స్ వద్ద నిలుచుని ఉండగా బోయిన్‌పల్లి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో నిజం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్ట చేసిన పోలీసులు అతడి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతడికి గంజాయి అప్పగించిన బలరామ్ కోసం గాలిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని యువకుడి మృతి



మొయిన్ సుల్తాన్ మృతదేహం

చిలకలగూడ : గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ఎస్‌ఐ కిషోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముషీరాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన మొయిన్ సుల్తాన్ (28) స్థానికంగా పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి అతను స్నేహితుని పుట్టినరోజు వేడుకలకు మల్కాజ్‌గిరి వెళ్లి తిరిగి వస్తుండగా, తార్నాక మెట్రో పిల్లర్ 1084 వద్ద సికింద్రాబాద్ వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. తీవ్ర ంగా గాయపడిన మొయిన్ సుల్తాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుని సోదరుడు మన్సూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఫలహార బండ్ల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి

అడ్డగుట్ట: బోనాల పండుగ సందర్భంగా ఫలహార బండ్ల నిర్వాహకులు శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని లాలాగూడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వహించే ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బోనాల పండుగ వేడుకలను శాంతియుతంగా జరుపుకునేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. నిర్వాహకులు పోలీసు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. డిజే, ఆర్కెస్ట్రాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లుదన్నారు. ఊరేగింపులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. గత సంవత్సరం ఫలహార బండ్ల ఊరేగింపులో కొన్ని చోట్ల చిన్న చిన్న గొడవలు జరిగాయని, ఈ సారి అలాంటి ఘటనలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ముందుగా ఫలహార బండల నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలతో కాలుష్య నియంత్రణ



చేతక్ 2901 వాహనాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సనత్‌నగర్: కాలుష్యం బారి నుంచి నగరాన్ని కాపాడుకోవాలంటే ఎలక్ట్రికల్ వాహనాల (ఈవీ) వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బేగంపేట రసూల్‌పురా మెట్రోస్టేషన్ సమీపంలోని చేతక్ సీఈసీ షోరూంలో మార్కెట్‌లోకి నూతనంగా వచ్చిన చేతక్ 2901 వాహనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం మరింతగా పెరగాలన్నారు. హైదరాబాద్ లాంటి నగరాల్లో కాలుష్య నియంత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. దేశం వ్యాప్తంగా ఎలక్ట్రికల్ వాహనాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. తాను కళాశాలకు వెళ్లే సమయంలో బజాజ్ చేతక్ పైనే వెళ్లేవాడినని, ఆ రోజుల్లో కేవలం రూ.3,000లకే ఆ వాహనాన్ని కొనుగోలు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ బాబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వాహన రంగంలో బజాజ్ విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చిందన్నారు. కొత్తగా మార్కెట్‌లోకి విడుదలైన చేతక్ వాహనాలు విభిన్న రంగాల్లో ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ మంజునాథ్, ఏరియా సేల్స్ మేనేజర్ ప్రవీణ్ పరదేశి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

బన్సీలాల్‌పేట్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు పేదలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించేలా పార్టీ శ్రేణులు పని చేయాలని బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐ. చిరంజీవి అన్నారు. బుధవారం సీసీ నగర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలపై విస్తతంగా ప్రచారం చేయాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అనేక పథకాలు, కార్యక్రమాలు ఆ పార్టీ నాయకులే ఎక్కువగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తుందన్నారు. దలకు అన్యాయం జరగకుండా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ పదవుల నియామక పత్రాలను అందజేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా పి. మోహన్‌క్రిష్ణ, జి. భాగ్యమ్మ, కె. నాగలక్ష్మీ, ఎల్. శిల్ప, కె. భరత్ రాజ్, సి. శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శులుగా ఎం.ఎం. రాజు, ఎ. మహేష్, గజానంద్, సాయి సందీప్, కార్యదర్శులుగా డి. రాజు, భీమ్‌రావు, షబానా బేగం, సంయుక్త కార్యదర్శులుగా కె. విజయ్‌కుమార్, శివకుమార్, సునీల్‌కుమార్ నియమితులయ్యారు.



నియామక పత్రాలను అందజేస్తున్న డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఓబీసీ మోర్చా నాయకులు

అడ్డగుట్ట: బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కన్వీనర్ పిట్ల నాగేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం మారేడుపల్లి మండల కార్యాలయం వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పిట్ల నాగేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని మరిచిపోయారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కులగణన చేసి బీసీల రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. గొల్ల కురుమలకు రెండవ దశ గొర్రెల పంపిణీకి సంబంధించి రూ. లబ్దిదారుని బ్యాంక్ ఖాతాలో వేస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టబద్ధమైన హోదాతో జ్యోతిరావు పూలే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి ఏడాదికి రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ. లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు కూడా ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదన్నారు. అనంతరం మారేడుపల్లి మండల కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఓబీసీ నేతలు దీపిక, నేతలు వెంకట చారి, వీర వర్ధన్, హరి, సంజయ్, ఠాగూర్, వాని, సత్యనారాయణ, రామకృష్ణ, సురేష్, నాగేష్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 10 మందికి జైలు

సనత్‌నగర్: బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 10 మందికి జైలు శిక్ష విధిస్తూ బుధవారం న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే..మంగళవారం రాత్రి బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య నేతృత్వంలో సిబ్బంది డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బుధవారం వారిని నాంపల్లి ఏడో జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి స్పందన ఎదుట హాజరుపరిచారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడిన తొమ్మిది మందికి నాలుగు రోజుల జైలు శిక్ష, రూ.3,300 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. మొదటి సారి పట్టుబడిన ఒకరికి రెండు రోజుల జైలు, రూ.2,100ల జరిమానా విధించినట్లు బేగంపేట ట్రాఫిక్ సీఐ పాపయ్య వివరించారు.

చదువుతోనే పేదల జీవితాల్లో వెలుగు

పద్మారావునగర్: విద్యాభివృద్ధితోనే పేదల జీవితాల్లో వెలుగు సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. బుధవారం బన్సీలాల్‌పేట్ డివిజన్, బోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో వైశ్య యూత్ అసోసియేషన్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, డ్రాయింగ్ పెన్నులు తదితర స్టేషనరీని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సికింద్రాబాద్ అధ్యక్షులు అఖిల్ జోగిపర్తి, మహదేవన్ రవి, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి, పరుశురామ్, జర్నలిస్ట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. చదువువే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. జీవితంలో మంచి స్థితిలో ప్రస్తుతం రాణిస్తున్న అనేక మంది కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నవారేనన్నారు. ఉపాధ్యాయులు చిన్నారులకు నైతిక విలువలతో కూడిన విద్యను బోధించాలన్నారు. వైశ్య యూత్ అసోసియేషన్ సికింద్రాబాద్ ప్రధాన కార్యదర్శి వినిత్ రాచమల్ల, కోశాధికారి సందీప్ బూరుగు, వీజే శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం